www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 7 ఏప్రిల్ 2024
5
తిరుపతి



నాలుగు నెలలుగా జీతాల కోసం నిరీక్షణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో పని చేసే సెక్యూరిటీ సిబ్బంది నాలుగు నెలలుగా జీతాల కోసం నిరీక్షిస్తున్నారు. సకాలంలో వేతనాలు ఇవ్వక పోవడంతో సెక్యూరిటీ సిబ్బంది ఆకలితో విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి ఏర్పడింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో వీరికి అదనపు డ్యూటీలు వేశారు. ముక్కంటి ఆలయంలో ప్రస్తుతం 185మంది సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు. వీరంతా వేతనాలు రాక అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. నెలనెలా రూ.కోట్లు ఆదాయం వస్తున్నప్పటికీ సెక్యూరిటీ సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించక పోవడం బాధాకరం. ఇందులో ఏజెన్సీ వారి సమస్య కూడా ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. ముక్కంటి ఆలయ అధికారులు ఇకనైనా స్పందించి సెక్యూరిటీ సిబ్బందికి వేతనం చెల్లించాల్సి ఉంది.

తిరుపతి ఇండియా ఫోరం అభ్యర్థిగా పి.మురళి

దేశంలో లౌకికవాదాన్ని బతికించుకుందాం


ఏకతాటిపై కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆర్‌పిఐ, ఆప్ నేతలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సార్వత్రిక ఎన్నికల్లో 'ఇండియా' ఫోరం అభ్యర్థులను గెలిపించుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు పిలుపు నిచ్చారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో శనివారం 'ఇండియా' ఫోరం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి సీపీఐ, సిపిఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, ఆర్ పీఐ నేతలు హాజరయ్యారు. 'ఇండియా' ఫోరం తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళిని గెలిపించాలని అందరూ తీర్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏ.రామానాయుడు మాట్లాడుతూ... దేశంలో లౌకికవాదాన్ని బతికించుకోవాలంటే 'ఇండియా' ఫోరంను గెలిపించుకుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య మంట పెడుతూ పబ్బం గడుపుకుంటోందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దాసోహమై దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తోందని రామానాయుడు ఆరోపించారు. అన్నదాత బతుకును ఛిద్రం చేసే నల్లచట్టాలను రద్దు చేయాలని డిమాండు చేస్తూ ఢిల్లీలో పంజాబ్, హర్యానా రైతులు పెద్ద ఎత్తున ఉద్యమం చేసినా మోదీ ప్రభుత్వం వారికి న్యాయం చేయలేదన్నారు. తమిళనాడులో 'ఇండియా' బలమైన కూటమిగా ఏర్పడిందన్నారు. దేశ వ్యాప్తంగా నరేంద్రమోదీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు.

తిరుపతి అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి పి.మురళి మాట్లాడుతూ... తిరుపతిలో అనేక ప్రజా సమస్యల పై సీపీఐ పోరాటం చేసిందన్నారు. పేదల పక్షాన నిలిచి భూ పోరాటాల ద్వారా వేలాది మంది పేదలకు భూములు పంచిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. తిరుపతి అభివద్ధి కోసం సీపీఐని గెలిపించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ... బీజేపీకి అంట కాగుతున్న వైసీపీ, టీడీపీ కూటమిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. బీజేపీ చేస్తున్న అరాచకాలను వైసీపీ, టీడీపీ, జనసేన నేతలు ఎందుకు ప్రశ్నించలేదని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ నేత మాంగాటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... నితీష్ కుమార్ ఇండియా కూటమి వ్యవస్థాపకుడు ఆయనను భయ పెట్టడం ద్వారా కూటమి నుంచి బయటికి వెళ్ళారన్నారు. ఆప్ పార్టీ నేతలు మాట్లాడుతూ.. ఉత్తర భారతదేశంలో ఆప్ పార్టీ బలపడుతోందన్నారు. కేజ్రీవాల్ ని అరెస్టు చేయడం ద్వారా అతనిని, పార్టీని బలహీన పరచాలని చూస్తోందన్నారు. ఆర్ పీఐ అధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ... ఈ సమావేశం తిరుపతి చరిత్రను తిరగ రాస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 25ఏళ్ళ క్రితం తిరుపతిలో సీపీఐ నారాయణ ఎమ్మెల్యేగా పోటీ చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి సుబ్రమణ్యం, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయ లక్ష్మి, శివారెడ్డి పాల్గొన్నారు.



వలసల 'దోబూచీ'

- గోడలు దూకుతున్న మాజీ ఎంఎల్‌ఎలు
- తాజాగా ఎంఎస్‌బాబు కాంగ్రెస్ తీర్థం
- రసవత్తరంగా పూతల'పట్టు' రాజకీయం

ప్రజాశక్తి - పూతలపట్టు

ఇన్నాళ్లూ స్తబ్ధుగా ఉన్న పూతలపట్టు రాజకీయం ఎన్నికల వేళ వేడెక్కుతోంది. మాజీ ఎంఎల్‌ఎలు కండువాలు మార్చుకోవడంతో చర్చనీయాంశమయ్యింది. వైసిపిలో టిక్కెట్ దక్కకపోవడంతో కొన్నాళ్లు తటస్థంగా ఉన్న ఎంఎస్ బాబు శనివారం అధినేత వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మూడుసార్లు టిడిపి నుంచి వరుస పరాజయం పాలై, మరోసారి టిక్కెట్ ఆశించిన లలితకుమారి సిఎం వైఎస్ జగన్ చేపట్టిన 'మేమంతా సిద్ధం' కార్యక్రమంలో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

నియోజకవర్గ పునర్విభజనానంతరం..

2009నుంచి పూతలపట్టు నియోజకవర్గంలో ఎవ్వరూ వరుస విజయాలు సాధించలేదు. టీడీపీ అభ్యర్థి లలితకుమారి వరసగా మూడు సార్లు పరాజయం పాలయ్యారు. కాగా 2009లో కాంగ్రెస్ నుంచి డాక్టర్ రవి, 2014లో వైసీపీ నుంచి డాక్టర్ సునీల్ స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. 2019లో ఎం.ఎస్ బాబు భారీ ఆధిక్యంతో గెలుపొందారు.


వ్యూహ.. ప్రతివ్యూహాలతో..

పూతలపట్టులో విజ్ఞులైన ఓటర్లు ఒకే వరుస విజయాలు ఇవ్వరనే మౌలిక సూత్రాన్ని ముందే పసిగట్టిన వైసీపీ ఆ దిశగా పావులు కదపుతోన్నట్లు తెలుస్తోంది. 2014లో గెలిచిన సునీల్‌ని 2019లో పక్కనబెట్టి ఎంఎస్ బాబుకు సీటు కేటాయించారు. ప్రస్తుతం మళ్లీ సునీల్‌కే సీటు ఖరారు చేశారు. పూతలపట్టులో ఎలాగైనా జెండా పాతాలనే లక్ష్యంగా పావులుకదిపిన టీడీపీ 2009నుంచి 3సార్లు పోటీ చేసి పరాజయం పాలైన మాజీ ఎమ్మెల్యే లలితకుమారిని ఈ దఫా పక్కనబెట్టి ఓ ప్రముఖ ఛానల్లో జర్నలిస్ట్‌గా పనిచేసిన డాక్టర్ కలికిరి మురళిమోహన్‌కు టికెట్ ఇచ్చింది. కాగా శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల సమక్షంలో ఎంఎస్ బాబు ఆ పార్టీలో చేరారు. దీంతో ఆయన కూడా పోటీలో ఉండే అవకాశం ఉంది.

మాజీ ఎంఎల్‌ఎలు గోడలు దూకుతుండడంతో మారుతున్న రాజకీయ సమీకరణలతో ఎవరి ప్రాబల్యం ఎంత అని చర్చ నడుస్తోంది. ఇన్నాళ్లూ వైసీపీలో ఉన్న ఎంఎస్ బాబు కాంగ్రెస్ గూటికి చేరారు. టీడీపీలో ఉన్న లలితకుమారి వైసీపీలో చేరారు. వీరిద్దరి వల్ల అక్కడి పరిస్థితులు ఎవరికనుకూలం అవుతుందనే ఊహాగానాలతో విశ్లేషకులు పరిపరి విధాలుగా అంచనాలేస్తున్నారు. అంతిమంగా ఎవరు విజయం సాధించినా స్వల్ప మెజారిటీనే ఉంటుందనే భావన బలంగా వినిపిస్తోంది.


టిడిపి మాజీ ఎంఎల్ఎ లలితకుమారి వైసిపిలోకి


2014లో వైసిపి నుంచి గెలుపొంది.. 2019లో అలిగి.. మళ్లీ బరిలో..


సిట్టింగ్ వైసిపి ఎంఎల్ఎ ఎంఎస్ బాబు కాంగ్రెస్‌లోకి


అందరి సాక్షిగా మహిళల కుస్తీపట్టు

సీఎంఎం సౌజన్యపై ఆర్పీల దాడి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

మెప్మా నిధులు దారిమళ్లుతున్నాయి అన్న విషయాన్ని గ్రహించిన మెప్మా సీఎంఎం సౌజన్య పై మూకుమ్మడిగా ఆర్పీలు దాడి చేసిన దారుణ ఘటన సూళ్లూరుపేట గాండ్ల వీధిలోని స్త్రీ స్వశక్తి భవనంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే మన్నారు పోలూరు సచివాలయ పరిధిలో మెప్మా నిధులు దారి మళ్లాయని గ్రహించిన సీఎంఎం సౌజన్య మెప్మా అధ్యక్షురాలు స్వప్నను, మరికొందరు ఆర్పిలను ప్రశ్నించడంతో వివాదం రాజుకుంది. శనివారం గాండ్ల వీధిలోని సచివాలయంలో ఆర్పీల సమావేశంలో సీఎంఎం ఫోన్ ను మెప్మా అధ్యక్షురాలు స్వప్న, ఆమె కుటుంబీకులు లాక్కోవడంతో వివాదం ముదిరి భౌతిక దాడులకు తెగబడ్డారు. సమాజం తలదించుకునేలా సాటి మహిళా అని చూడకుండా బట్టలు చిరిగిపోయేటట్టు సి ఎం ఎం సౌజన్యపై దాడికి తెగబడ్డారు. దీనిపై ఇరుపక్షాలకు సంబంధించిన వారు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

వృద్ధులకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-సూళ్లూరుపేట వాసవి క్లబ్ సభ్యులు దుడ్డు చంద్ర శేఖర్ తాతయ్య కీర్తిశేషులు అలవల వెంకట సుబ్బయ్య శెట్టి వర్ధంతి సందర్భంగా శనివారం బాపూజీ కాలనీలోని శ్రీ సాయి వద్ధాశ్రమం లోని వృద్ధులకు చీరలు బహుకరించినారు. ఈ కార్యక్రమం వాసవి క్లబ్ సూళ్లూరుపేట వారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ సాయిరామ్, సభ్యులు దుడ్డు చంద్ర శేఖర్, ఆలవల దయాకర్, ఆలవల ఉదయ్, కాకి వేణు గోపాల్, గుర్రం ప్రసాద్, జాలాది చంద్ర శేఖర్, వద్ధాశ్రమం నిర్వాహకులు మస్తాన్ బాబు పాల్గొన్నారు.

చిన్నశేష వాహనంపై శ్రీ కోదండరాముడు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం 8 గంటలకు చిన్నశేష వాహనంపై శ్రీ రామచంద్రమూర్తి భక్తులను కటాక్షించారు. గజరాజులు ముందు కదులుతుండగా, భక్తజన బందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. వాహనసేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీనివాసుడి విహారం

మండలంలోని శ్రీనివాస మంగాపురంలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకసేవ నిర్వహించి బంగారు ఆభరణాలు, వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, వెంకటస్వామి, ఆర్జితం ఇన్స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

కరుణాకర్ రెడ్డి ఇంటింట ప్రచారం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

వైసిపి అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 34, 35 వార్డుల్లో జరిగిన ప్రచారం సందర్భంగా భూమన కరుణాకర్‌రెడ్డిని అడుగడుగునా నీరాజనం పలికారు. గుమ్మడికాయల దిష్టి తీశారు. పూల వర్షం కురిపించారు. భూమన కరుణాకర్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేస్తూ, ఫ్యాను గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, పాలగిరి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధిగా నీలం బాలాజీ

తిరుపతి వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధిగా నీలం బాలాజీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నీలం బాలాజీ మాట్లాడుతూ తిరుపతి ఎమ్మెల్యేగా భూమన అభినయ్ విజయం కోసం తన వంతు కషి చేస్తామని ప్రకటించారు.



అన్నమయ్య గొప్ప సామాజికవేత్త

ప్రజాశక్తి - తిరుపతి సిటి

భగవంతుని దష్టిలో మనుషులందరూ సమానమేనని తన సంకీర్తనల ద్వారా చాటి చెప్పిన తాళ్లపాక అన్నమయ్య గొప్ప సామాజికవేత్త అని శ్రీ కష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ విసి ఆచార్య భూమన కుసుమకుమారి చెప్పారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 521వ వర్ధంతి ఉత్సవాలు శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య కుసుమకుమారి "అన్నమయ్య - సామాజికత" అనే అంశంపై ఉపన్యసించారు. 600 సంవత్సరాల క్రితం అప్పటి సామాజిక పరిస్థితులకు వ్యతిరేకంగా అన్నమయ్య గళం విప్పారని చెప్పారు. పలు సంకీర్తనల్లో ఆనాటి గ్రామీణ పరిస్థితులు, పాడి పంటలు, సాగునీరు, కుటుంబ సంబంధాలు తదితర అంశాలను తెలియజేశారని అన్నారు. మహిళలకు సమాన అవకాశాలు ఉండాలని నొక్కి చెప్పారని తెలిపారు. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రంకు చెందిన ఉపన్యాసకులు డా.సౌజన్య "అన్నమయ్య - నైతికత " అనే అంశంపై ఉపన్యసించారు. నెల్లూరు క్లాసికల్ తెలుగు సెంటర్ పరిశోధకులు డా.లోకేశ్వరి " వెంగమాంబపై అన్నమయ్య ప్రభావం " అనే అంశంపై ప్రసంగించారు. విశాఖపట్నంకు చెందిన హరిత సిస్టర్స్, గ్రంధి సాయికృతి బృందం సంగీత సభ అందరినీ అలరించింది. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

వడదెబ్బకు రైతు మృతి

ప్రజాశక్తి - ఏర్పేడు (తిరుపతి జిల్లా)

ఎండలు మండిపోతుండడంతో తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం దుగ్గిపేరి వాస్తవ్యుడు కందప్పగారి సుబ్రమణ్యం రెడ్డి (52) అనే రైతు వడదెబ్బతో మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఏర్పేడు మండలం నచ్చనేరి గ్రామ పంచాయతీ దుగ్గిపేరి వాస్తవ్యుడైన కందప్పగారి సుబ్రమణ్యం రెడ్డికి ఒకటిన్నర ఎకరా పొలం ఉంది. పొలం పనులు చేసి శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఎండ వేడిమితో వాంతులై తీవ్ర అస్వస్థగకు గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మార్గమధ్యంలోనే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతుని కుటుంబానికి ఏర్పేడు మండల వైసిపి నాయకులు కిషోర్‌రెడ్డి, కూనాటి రమణయ్య యాదవ్, నల్లపాలెం శివయ్యలు 5వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. గత ఏడాది పెద్ద కొడుకు యాక్సిడెంట్‌లో చనిపోయాడు.

'అంకుర'లో చిన్నారికి పునర్జన్మ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తీవ్రమైన న్యూమోనియా, ఊపిరితిత్తులలో రక్తస్రావంతో ప్రాణపాయ స్థితిలో ఉన్న 2 సంవత్సరాల 8 నెలల చిన్నారి నిహాస్వినికి అంకురా ఆసుపత్రి వైద్యబృందం అత్యాధునిక వైద్యసేవలతో పునర్జన్మను ప్రసాదించారని ఆ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు వంశీకృష్ణ తెలిపారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని అంకురా ఆసుపత్రిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వేకోడూరు, రెడ్డిగుంటకు చెందిన శివశంకర్ కుమార్తె నిహాస్వినిని మార్చి 20వ తేది అంకురా ఆసుపత్రికి తీసుకొచ్చారు. తీవ్రమైన న్యూమోనియా, ఊపిరితిత్తులలో రక్తస్రావంతో చిన్నారి ఆరోగ్యం బాగా క్షీణించింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ చిన్నారిని పరిశీలించిన డాక్టర్లు వంశీ, పృధ్వీ, దినేష్, రామ్‌మోహన్, రవిచంద్ర బృందం వెంటనే



హైఫ్రీక్వెన్సీ ఓసిలేటరీ వెంటిలేషన్‌ను ప్రారంభించింది. చిన్నారి శరీరం అత్యాధునిక వైద్యానికి సహకరించడంతో పది రోజుల వ్యవధిలోనే పూర్తిగా కోలుకుంది. అంకురలో నలుగురు పిడియాట్రిక్ ఇంటెన్సివ్ నిపుణులు అందుబాటులో ఉండటం వల్ల క్లిష్టమైన సమయంలోనూ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తున్నారని తెలిపారు. వైద్యుల బృందానికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

చైతన్యపురంలో ఏనుగుల బీభత్సం

ప్రజాశక్తి - రేణిగుంట

తిరుపతి సమీపంలోని రేణిగుంట మండలం చైతన్యపురంలో ఏనుగుల బీభత్సం అన్నదాతలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా, కన్నీరు పెట్టిస్తోంది. చైతన్యపురం గ్రామంలో ఏకంగా 15 ఏనుగులు సంచరించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఏనుగుల బీభత్సంతో పంటపొలాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మామిడి పంటపై ఆధారపడ్డ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు 80 ఎకరాల్లో మామిడి తోటలు ధ్వంసమయ్యాయని రైతులు వాపోతున్నారు. అటవీ శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేకపోవడంతో రాత్రుల్లో పంటలను రక్షించుకోడానికి ప్రాణాలకు తెగించి తమ వద్ద ఉన్న బాణసంచాను పేల్చి ఏనుగులను తరిమేసే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఎలాంటి లాభం లేకుండా పోయిందని, అలవాటు పడిన ఏనుగులు పొలాల్లోకి వస్తూనే ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

వైసీపీ నుండి జనసేనలోకి వలసలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తిరుపతి నగర పరిధిలోని 48వ డివిజన్ నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో జనసేన పార్టీలోకి కూటమి అభ్యర్థి ఆరని శ్రీనివాసులు సమక్షంలో జనసేన కండువా కప్పుకొని పార్టీలో చేరారు. 48వ డివిజన్ వైసిపి గౌరవ అధ్యక్షులు బాలాజీతో పాటుగా దాదాపు 500 మంది జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఉమ్మడి కూటమి అభ్యర్థి ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఏ వర్గానికి న్యాయం జరగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులైన యువత పెద్ద సంఖ్యలో జనసేనలో చేరడం హర్షించదగ్గ విషయం అన్నారు. తిరుపతిలో కూటమి అభ్యర్థి అత్యధిక మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు.

పింఛన్ పా(ఫ్)ట్లు

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఎన్నికల్లో ఎత్తులు, పైఎత్తులు, వ్యూహాలు, సమీకరణలు, రాజకీయ విమర్శలు అన్నీ షరా మామూలే. కానీ ప్రభుత్వ సాయం కోసం వెయ్యికళ్లతో ఎదురుచూసే వృద్ధులు, వితంతువులు, వికలాంగులుపై పైశాచికత్వం ప్రదర్శించడం బూర్జువ రాజకీయ పార్టీలకే చెల్లింది. అసలే ఎండకాలం, ఆపై ఎన్నికల సమయం వెరశి వృద్దుల పాలిట శాపంగా మారింది. కాదు... మారేలా చేశారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభం, ఈసి ఆదేశాలతో ప్రభుత్వం ప్రత్యామ్నాయం పల్లవి అందుకోగా, ప్రతిపక్షం ఓ పక్క ఈసికి ఫిర్యాదు చేసి మరీ అడ్డుకుని, తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించడం గమనార్హం. అటు అధికార, ఇటు ప్రతిపక్షాలు రెండు రాజకీయ ఫీట్లు చేయడంతో వృద్దులకు పెన్షన్ పాట్లు తప్పలేదు. ఆఖరికి జిల్లాలో మూడో తేదీ ముగ్గురు వృద్దులు పెన్షన్ కోసం పడిగాపులు కాచి మృత్యువాత పడ్డారు. వీరి మృతికి కారకులెవ్వరు...? ఓట్ల రాజకీయంతో మీరంటే మీరే అంటూ అధికార, ప్రతిపక్షాలు జారుకోవడం కొస మెరుపు. ఈనెల మూడో తేదీ నుంచి 5వ తేదీ రాత్రి 7.25 వరకూ 95.5 శాతం పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. 2,71,477 మంది లబ్దిదారులకు గాను 2,53,804 మందికి 76,91,03,000 వేల రూపాయలను అందజేశారు. మిగిలిని ఐదు శాతం ఆరు, ఏడు తేదిల్లో పూర్తి చేస్తామని అధికారులు ప్రకటించారు.

జిల్లా వ్యాప్తంగా 2,71,477 మంది పింఛన్ లబ్దిదారులు ఉన్నారు. వారికి 80,83,18,500 రూపాయలు నిధులు విడుదలయ్యాయి. అసలే ఎండకాలం, తీవ్రమైన వేడిగాలులు వీస్తున్నా, పెన్షన్ ఆలస్యం అవుతుందని తెలియని కొంత మంది లబ్దిదారులు ఆయా వలంటీర్ల చుట్టు, సచివాలయాల చుట్టు తిరిగి, తిరిగి వడదెబ్బకు గురై మృత్యువాతపడ్డారు. తిరుపతి జిల్లాలోనే ఏప్రిల్ మూడో తేదీ ముగ్గురు వృద్దులు ఎండదెబ్బకు గురై మృతి చెందారు. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం, ఎర్రవారిపాళెం మండలం, నెరబైల్ సచివాలయం వద్ద పింఛన్ తీసుకునేందుకు వచ్చిన లబ్దిదారుడు షేక్ అసం సాహెబ్ కళ్లు తిరిగి పడిపోవడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలోపు మార్గమధ్యలోనే చనిపోయారు. సూళ్లూరు పేట పట్టణంలోని సాయినగర్‌కుచెందిన ఈశ్వరవాక లలితమ్మ. వెంకటగిరికి చెందిన వెంకటయ్య వీరి ముగ్గురు మరణానికిక కారకులెవ్వరు?

వృద్దులు, వితంతువుల, వికలాంగులు, డయాలసిస్ రోగులు వంటి వారి పోషణ కోసం ప్రభుత్వ సహాయంగా పింఛన్ అందజేస్తోంది. గతంలో ఉన్న ప్రభుత్వాలు సైతం వీటిని అందించేవి. 2019కి ముందు ఆయా పంచాయితీ కార్యాలయాల వద్ద లబ్దిదారులకు వీటిని పంపిణీ చేసేవారు. 2019లో వైఎస్ఆర్‌సిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్లు, ఇతరత్రా ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఇంటి వద్దనే అందించేందుకు వాలంటరీ, సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి వాలంటరీకి 50 నుంచి 100 కుటుంబాలను అప్పగించి, వారికి ప్రభుత్వ పథకాలను చేరువ చేయడం, ప్రభుత్వ కార్యాలయాల్లో వారికి అవసరమైన సర్టిఫికెట్లు మంజూరుకు సహకరించడం వంటి పనులను వాలంటీర్లకు అప్పగించింది. అప్పటి నుంచి వాలంటీర్‌ఉదయం 6 గంటలకే లబ్దిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్‌ను అందించేవారు. ఈ వాలంటరీ వ్యవస్థపై టిడిపి, జనసేన పార్టీలు ఏడాది కాలంగా విమర్శలు ఎక్కుపెట్టాయి. తీరా ఎన్నికల సమయం రానే వచ్చింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.

ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పెన్షన్‌ను ఏప్రిల్ 3వ తేది నుంచి పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ లోపు టిడిపి, జనసేన పార్టీలు వలంటీర్లపై ఈసికి ఫిర్యాదు చేయడంతో వారిని ఎన్నికలు పూర్తయ్యేవరకు విధులకు దూరంగా ఉంచాలని, పెన్షన్ ఇతరాత్ర వాటికి ప్రత్యామ్నాయాలను చూసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. అవ్వాతాతలకు ఇచ్చే పెన్షన్లపై ప్రతిపక్షం మోకాళ్లడిందని, అయినా ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నామని అధికార పక్షం చెప్పకొచ్చింది. పెన్షన్ పంపిణీకి తామేమి వ్యతిరేకం కాదంటూ ప్రతిపక్షం చెప్పకొచ్చింది. ఇలా ఒకరిపై ఒకరు నెపం వేసుకోవడం పరిపాటిగా చేసుకున్నారు. లబ్దిదారులకు మాత్రం ఇబ్బందులు తలెత్తాయి. అధికార, ప్రతిపక్ష రాజకీయ ఫీట్లతో పెన్షన్ లబ్దిదారులకు పాట్లు తప్పలేదు.

సచివాలయ సిబ్బంది మానవత్వం

ప్రజాశక్తి -కోట : ఆస్పత్రిలో ఆపరేషన్ చేసుకుని చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి కోట బిట్ 3 సచివాలయ సిబ్బంది అతని వద్దకే పింఛను తీసుకెళ్లి ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. అవ్వ తాతలకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది పింఛను అందిస్తున్న నేపథ్యంలో కోట మండలం శ్యామసుందరపురం కాలనీలో నివసిస్తున్న ఎంబేటి ముత్యాలయ్య ప్రత్యేక ప్రతిభావంతుల పింఛనుదారుడు. అయితే ఇటీవల తన ఎడమ కాలు ఆపరేషన్ నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కోట బిట్ 3 సచివాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్ హైమావతి, డిజిటల్ అసిస్టెంట్ మధుసూదన్ రావు ఓ నిరుపేదకు ఎలాగైనా పింఛను అందించాలని నిశ్చయించారు. వెంటనే డిజిటల్ అసిస్టెంట్ మధుసూదన్ రావు తన సొంత ఖర్చులతో ద్విచక్ర వాహనంపై నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంబేటి ముత్యాలయ్య వద్దకు చేరుకుని పింఛను అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు ఎంబేటీ ముత్యాలయ కన్నీటి పర్యంతమయ్యాడు. తాను నడవలేని స్థితిలో ఉన్నా తన వద్దకు వచ్చి పింఛను అందించిన వెల్ఫేర్ అసిస్టెంట్ హైమావతి, డిజిటల్ అసిస్టెంట్ మధుసూదన్ రావుకు రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీలోకి వలసలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణానికి చెందిన పలువురు టీడీపీ సానుభూతిపరులు శనివారం పెద్ద ఎత్తున వైసీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రామచంద్ర కూల్డ్రింక్స్ అధినేత గరికపాటి చంద్రశేఖర్ బాబు, విశ్రాంత ఉపాధ్యాయులు పోలస్వామి స్వర్ణ మూర్తి, ఎస్వీఆర్ సైకిల్ షాప్ అధినేత శేషంశెట్టి ప్రభాకర్, ప్రముఖ వ్యాపారవేత పుట్టం రాజా, వారి అనుచరులు సుమారు 200 మంది స్థానిక కైకాల వారి సత్రంలో వైసీపీలోక చేరారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేయాలని, ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, పగడాల రాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం, రాజుల కండ్రిగ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సర్పంచ్ చెంగలరాజు ఆధ్వర్యంలో పవిత్ర రెడ్డి వైసిపి కండువ కప్పి ఆహ్వానించారు. వైసిపిలో చేరిన వారిలో జే. చెంగముని, రాజు, సురేష్, దాశరాజు లక్ష్మణ రాజు, ఎరమ్మ రాజు,నంద రాజు వున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఇన్ఛార్జి గున్నేరి కిషోర్ రెడ్డి , జే జనార్ధన్ రాజు, గోపి యాదవ్, మధు రాజు ,మని రాజు, చెలమ్మ రాజు, మునికృష్ణం రాజు, మురళి రాజు, భాస్కర్ పాల్గొన్నారు.

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలో అభివృద్ధికే ఆదర్శంగా నిలిచిన రోజాను మళ్ళీ హ్యాట్రిక్ తో గెలిపించుకుంటామని పుత్తూరు మునిసిపాల్టీ 12 వ వార్డు ప్రజలు పేర్కొన్నారు. 12వ వార్డులో మంత్రి ఆర్.కె.రోజా ముత్తరాసి కండ్రిగ, కోనప్పగుంట, చిన్నబ నాయుడు కండ్రిగ, కుందేలుగుంట ఎస్టీ కాలనీలలో వైసీపీ నాయకులు కార్యకర్తలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తనను మళ్లీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు, వైస్ ప్రసిడెంట్లు క్రియాశీల సభ్యులు, జేసిఎస్ కన్వీనర్లు, సచివాలయ. మున్సిపల్ ఛైర్మన్ ఏ హరి, వైస్ ఛైర్మన్లు డి జయ ప్రకాష్, డి శంకర్. కన్వీనర్లు, గృహ సారథులు, ఆలయ కమిటీ ఛైర్మన్లు మెంబర్లు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాల్టీ పరిధిలో చిన్నరాజు కుప్పం ఎస్టి కాలనీకి చెందిన వైసిపి కార్యకర్త చంద్రయ్య అకస్మాత్తుగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పర్యాటక మంత్రి ఆర్కే రోజా సోదరులు వైరాం ప్రసాద్ రెడ్డి పుత్తూరు మున్సిపాల్టీ చిన్నరాజుకుప్పం ఎస్టీ కాలనీ వద్దకు వెళ్లి చంద్రయ్య మృత దేహానికి శనివారం పూల మాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అంత్యక్రియలకు రోజా ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఏ హరి, మండలం వైసిపి కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని అంజిమేడు గ్రామ పంచాయతీలో రేణిగుంట డిఎస్పి భవ్య కిషోర్, ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాస్, ఎస్ఐ ఆధ్వర్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలకు అవగాహన ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా పులివర్తి వినీల్ పుట్టినరోజు వేడుకలు



ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి వెంకట మణి ప్రసాద్(నాని) తనయుడు పులివర్తి వినీల్ జన్మదినం సందర్భంగా ఆరి లీలా మోహన్ నాయుడు శనివారం భారీ కేకును కట్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బాబు ష్యూరిటీ– భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించి పులివర్తి నానిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మండల టిడిపి అధ్యక్షుడు తిరుమల రెడ్డి మాట్లాడుతూ పులివర్తి నానికి ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే అనుపల్లి పంచాయతీలో డీకేటి భూముల సమస్యను పరిష్కరిస్తారని రైతులకు తెలిపారు. టిడిపి గెలుపుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ డి బిందు మాధవి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే చంద్రగిరి నియోజకవర్గంలో పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి బిందు మాధవి, జనాజ ప్రకాష్, కొనాల ప్రసాద్ రెడ్డి, కె గోపాల్ రెడ్డి, టి మోగల్ రెడ్డి, బండి విజయ్ కుమార్ రెడ్డి, పంతల వెంకటేష్ నాయుడు, టి వెంకటేష్ రెడ్డి, వి కృష్ణమూర్తి, బొద్దు సోము రాయలు, బొద్దు మధుసూదన్ రాయల్, వై సుబ్రహ్మణ్యం రెడ్డి, కె సోమశేఖర్ శెట్టి, కె నరసింహారెడ్డి, జె మహేష్, ఎ కుమార్, రమేష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ అధిష్టాన నిర్ణయాన్ని అనుసరించాలి
టిడిపి కూటమి నాయకుల నిర్ణయం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పార్టీ అధిష్టాన నిర్ణయమే తమకు శిరోధార్యమని టిడిపి కూటమి నాయకులు పేర్కొన్నారు. సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల నాయకులతో సత్యవేడు నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో పిచ్చాటూరు ఎంపికే కళ్యాణ మండపంలో ప్రజాగళం సభను శనివారం నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి మాధవులు నాయుడు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నియమించిన అభ్యర్థిని గెలిపించడం మండల నాయకులు నియోజకవర్గ నాయకుల కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆది మూలం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సత్యవేడు నియోజకవర్గం టికెట్ ఇచ్చిన చంద్రబాబునాయుడుకు, లోకేష్ రుణపడి ఉంటానని తెలిపారు. తన విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భక్తుని సొమ్ము ...భద్రంగా అప్పగింత

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చి ఆటోలో వెళుతూ బ్యాగ్ పోగొట్టుకున్న బాధితుడికి ఆటో డ్రైవర్ నిజాయితీగా బ్యాగ్ అప్పగించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. విశాఖపట్నం చెందిన భక్తుడు తిరుమల శ్రీవారి దర్శనార్థం శనివారం తిరుపతికి చేరుకున్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ కి వెళ్లేందుకు ఆటోను ఆశ్రయించారు. ఆటోడ్రైవర్ బస్టాండ్ వద్ద భక్తున్ని డ్రాప్ చేసి తిరిగి వెళ్లిపోయారు. భక్తుడు ఓ బ్యాగ్ మర్చిపోయి వెళ్లడాన్ని గమనించి, ఆటో డ్రైవర్ నగేష్ నిజాయితీగా ఆ బ్యాగ్ను ఈస్ట్ పోలీసులకు అప్పగించారు. అందులో 6వేల రూపాయల నగదుతో పాటు శ్రీవారి ముడుపుకు చెందిన 15వేల రూపాయల డబ్బులు, ఆత కమ్మలు, వెండి కాళ్ళ పట్టీలు, సెల్ ఫోను, ఏటీఎం కార్డులు ఉన్నాయి. సెల్ఫోన్ ఆధారంగా బాధితున్ని గుర్తించిన పోలీసులు సమాచారం అందించి పోలీసుల సమక్షంలో ఆటో డ్రైవర్ చేత భక్తుడికి బ్యాగును అందజేశారు. నిజాయితీగా బ్యాగ్ అప్పగించిన ఆటో డ్రైవర్ కి పోలీసులు, బాధితుడు కతజ్ఞతలు తెలిపారు.

తిరుపతి డిపో గ్యారేజ్ పరిశీలించిన డిపిటిఒ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి జిల్లా డిపిటిఒ చెంగల్ రెడ్డి తిరుపతి డిపో గ్యారేజ్ ను సందర్శించారు. కొత్తగా డిపోకు కేటాయించిన ఆల్ట్రా డీలక్స్ బస్సును వాటిలో ఉన్న సౌకర్యాలను పరిశీలించి, డిపోలో గ్యారేజ్, డ్రైవర్ కండక్టర్ సిబ్బందితో సమీక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్, కండక్టర్, గ్యారేజ్ సిబ్బంది రానున్న వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బ నుండి తమను తాము రక్షించు కోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేస్తూ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పంపిణీ చేయబడిన ఓఆర్ఎస్ పాకెట్స్ ను అందజేశారు. ప్రస్తుతం మార్చి 16 నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగులు తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఏ ఏ చర్యలు ఉల్లంఘనల కిందకు వస్తాయో వాటిని తెలిపి, కోడ్ను అనుసరించాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి: ప్రిన్సిపాల్



మాట్లాడుతున్న శ్రీ పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ

ప్రజాశక్తి - క్యాంపస్: మనచుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని శ్రీ పద్మావతి డిగ్రీ, పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ టి నారాయణమ్మ పిలుపు నిచ్చారు. శ్రీ పద్మావతి ఉమెన్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో 'పరిశుద్ధ కళాశాల, సుందర కళాశాల' కార్యక్రమాన్ని ఆహ్లాద భరితంగా శనివారం కాలేజీ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవడం అందరి బాధ్యత అన్నారు. పరిశుభ్రత వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. మానసిక ఆరోగ్యం చేకూరితే అందరితో స్నేహ సంబంధాలు కొనసాగుతాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రథమ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల అందరిలో శారీరక ఉత్సాహం ఏర్పడు తుందని, తద్వారా ఆరోగ్యం చేకూరు తుందన్నారు. ఎన్ఎస్ఎస్ ద్వితీయ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ దివ్యవాణి మాట్లాడుతూ శుభ్రత వల్ల ఆరోగ్యం వస్తుం దన్నారు. విద్య బాగా రావాలన్నా పరిసరాల శుభ్రత అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుజాతమ్మ, డాక్టర్లు భువనేశ్వరి, సునీత, వసుధ, శిరీష, పద్మజ, సంధ్యవరలక్ష్మి, చెంచులక్ష్మి, శ్రీలత, పద్మావతి, విజయ, ఉమ, హేమలత, నాగమణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

'ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలి'

ప్రజాశక్తి - క్యాంపస్: సమాజంలో నివసించే ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య సాయి సుజాత పేర్కొన్నారు. ఎస్వీయూలోని మహిళా అధ్యయనకేంద్రం ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్యం, ఆహారం అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం ఏప్రిల్ ఏడో తేదీని ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తారని ఈ సంవత్సరం 'నా ఆరోగ్యం నా హక్కు' అనే నినాదంతో ప్రజలలో అవగాహన కల్పిస్తోందని ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలు, విద్య, సమాచారం, సురక్షితమైన తాగునీరు, స్వచ్ఛమైన గాలి, మంచి పోషకాహారం, నాణ్యమైన నివాసం, మంచి పని, పర్యావరణ పరిస్థితులు, స్వేచ్ఛను పొందే హక్కు ప్రతి ఒక్కరికీ, ప్రతిచోటా పొందేందుకు ఈ సంవత్సరం థీమ్ ఎంపిక చేశారన్నారు. ఆరోగ్యమంటే శారీరక, మానసిక సామాజిక అంశాల సమ్మిళితమని పేర్కొన్నారు.

రోడ్డుపైనే మురుగు నీరు
డ్రైనేజీలు లేక ఇబ్బందులు



డ్రైయినేజీలు లేక రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు నీరు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని 14వ వార్డులో మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. డ్రైనేజీలు లేక రోడ్డుపై మురికి నీరు పారుతోంది. మురుగు నీటి వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయి వార్డు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో కంటి మీద కునుకు కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గతంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. అధికారులు నిధులు లేవని కుంటి సాకులు చెప్పి తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే రోడ్డుపై మురుగు నీరు ప్రవహించకుండా డ్రైనేజీలు నిర్మించి వార్డు ప్రజలకు దోమల బారి నుండి రక్షించాలని ఆ వార్డు ప్రజలు కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించాలని లేని పక్షంలో వార్డు ప్రజలు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడు తామని హెచ్చరించారు.

'శ్రీరామ'లో పూర్వ విద్యార్థుల సమావేశం



పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న అరవింద్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుపతి–కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఐక్యం–2024 పేరుతో కళాశాల యాజమాన్యం శనివారం ఘనంగా నిర్వహించింది. ఈ పూర్వ విద్యార్థుల సమావేశానికి శ్రీరామ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు హాజరై గత అనుభవాలను నెమరు వేసుకుంటూ, విద్యార్థుల లక్ష్యాల పట్ల కళాశాల యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలతోనే నేడు వివిధ రంగాల్లో స్థిరపడ్డామని తెలిపారు. కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ శ్రీరామలో విద్యార్థులను క్రమ శిక్షణతో పాటు వారి లక్ష్యాలకు అనుగుణంగా తగిన తర్ఫీదును అందించామని ఫలితంగా నేడు ఉన్నత స్థాయిలో విద్యార్థులు తమ సత్తాను చాటుకున్నారన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో ఉన్నత స్థాయిలో ఆలోచించి కళాశాలలో ప్రణాళిక బద్ధంగా విద్యా బోధన సాగిస్తున్నామని విద్యార్థు లకు వాటి ఫలితాలు అందుతాయన్నారు. గత విద్య అనుభవాలను నేటి విద్యార్థు లకు వివరించాలని పూర్వ విద్యార్థులను కోరుతున్నామన్నారు. శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలకు నాక్–ఏ గ్రేడు రావడం పట్ల పూర్వ విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె జయచంద్ర, వివిధ విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి
- సిఫాల్ హెర్బల్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో యలవర్తి విద్యాసాగర్



మాట్లాడుతున్న సీఈవో యలవర్తి విద్యాసాగర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విద్యార్థులు ఎప్పటి కప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకోవాలని సిఫాల్ హెర్బల్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో యలవర్తి విద్యాసాగర్ పేర్కొన్నారు. గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సాంకేతిక సింపోసియం శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు సిఫాల్ హెర్బల్ ప్రైవేట్ లిమిటెడ్ సిఈఓ వై విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్య, ప్రస్తుతం పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్తు తరాలకు ఇంజనీర్ల ఆవశ్యకత సాంకేతికతలో ఉన్న మార్పులు, అవలంబిస్తున్న పరిస్థితులు సంప్రదాయ తయారీ ప్రక్రియను అర్థం చేసుకోవడం గురించి వివరించారు. డేటా సైన్స్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్లో ఉద్యోగ అవకాశాలను వాటి ఆవశ్యకత గురించి తెలిపారు. ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఇంజనీరింగ్ కళాశాలల నుండి 400 మంది విద్యార్థులు, 800 మంది నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పేపర్ ప్రెసెంటేషన్ పోస్టర్ ప్రెజెంటేషన్ టెక్నికల్ క్విజ్ ఫ్యాషన్ షో స్పాట్, ఈవెంట్స్ వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అన్ని విభాగా లలో ఇలాంటి సదస్సులు తరచూ నిర్వహిస్తున్నామని తద్వారా విద్యార్థులు, నిపుణులు, పరిశోధకులు, అభ్యా సకులు ఒకచోట చేరుతారని ఒక నిర్దిష్ట రంగం క్షేత్రం లేదా అంశం లోని పరిశోధన ఫలితాలు చర్చించడం, జ్ఞానం మార్పిడి చేయడం సింపోసియం ఉద్దేశం అని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకొని భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు పొందేందుకు సింపోసియం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ పోటీలో పాల్గొనడం ద్వారా వారి నైపుణ్యాలను ప్రదర్శించడం, మెరుగుపడుతుందని తెలిపారు. వివిధ విభాగలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను మెరిట్ సర్టిఫికెట్స్ అందించారు. హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు మండలం అలిమేలు మంగాపురం గ్రామంలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించింది. ఏఎం పురం గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనే పేద రోగులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. శిబిరంలో 11 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్య సురక్ష మొదటి విడత కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిందని, దీన్ని దృష్టిలో వుంచుకొని ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. క్యాంపులో రోగులకు వైద్య పరీక్షలతో పాటూ ఉచిత మందులు, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకోవడానికి రెఫర్ చేస్తున్నామని తెలిపారు. పేద రోగులు ఆస్పత్రి చుట్టూ తిరగకుండా వైద్యులే ప్రజల వద్దకే వైద్యచికిత్స అందించడం ఈ క్యాంపు ముఖ్య ఉద్దేశమన్నారు. దీంతో పాటు కంటి వైద్య శిబిరాలు, నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రోగులను దాసుకుప్పం పిహెచ్సి వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల వైద్యులు డాక్టర్ విద్యాసాగర్ రోగులను పరీక్షించి ఉచిత మందులు పంపిణీ చేశారు. దీంతో పాటు రోగులకు అవసరమైన బిపి, షుగర్, హిమోగ్లోబిన్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన మహిళలు 164 మంది, పురుషులు 110 మంది, విద్యార్థు ఏడుగురు, మరో 14 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసుకుప్పం పిహెచ్సి ఎంపిహెచ్ఈఓ సుబ్రమణ్యం,హెల్త్ అసిస్టెంట్ షణ్ముగం, ఫార్మాసిస్టు భార్గవి, ఎంఎల్ హెచ్పి సౌమ్య, ఏఎన్ఎం రేణుక, ఆరోగ్య మిత్ర మునెమ్మ, ఆశా వర్కర్లు మరియ, బుజ్జమ్మ పలువురు రోగులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతే లక్ష్యం
- బొజ్జల సుధీర్ రెడ్డి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ముస్లింల అభ్యున్నతే టీడీపీ లక్ష్యమని శ్రీకాళహస్తి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి పేర్కొన్నారు. రంజాన్ మాసంను పురస్కరించుకుని పట్టణంలోని ఓ ప్రైవేట్ హాలులో శనివారం రాత్రి ముస్లింలకు సుధీర్ రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లింలతో కలసి భోంచేశారు. టీడీపీ హయాంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని ఈ సందర్భంగా సుధీర్ గుర్తు చేశారు. అయితే వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ సంక్షేమ పథకాలకు చరమగీతం పాడారన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే పూర్వపు సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ముస్లింల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేశారన్నారు శ్రీకాళహస్తి పట్టణంలో రెండు షాదీమహళ్లు, రెండు ఈద్గాలకు స్థలం కేటాయిం చడంతో పాటు వాటిని నిర్మించి ఇచ్చారని, మసీదుల అభివృద్ధికి ఆయన సహకరించా రన్నారు. ముస్లింల శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించిన ఘనత తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డిదే అన్నారు. శ్రీకాళహస్తిలోనే ముస్లింల కోసం సుమారు రూ.150కోట్లు ఆస్తులు తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కేటాయించారన్నారు. పలువురు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ' శ్రీనివాస్ తేజ' వార్షికోత్సవం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో శ్రీనివాస్ తేజ హైస్కూలులో శ్రీనివాస్ తేజ కరస్పాండెంట్ సుధాకర్ ఆధ్వర్యంలో 28 వార్షికోత్సవ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలువురు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు హాజరయ్యారు. హాజరైన వారికి శ్రీనివాస్ తేజ కరస్పాండెంట్ సుధాకర్ దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తమ శ్రీనివాస్ తేజ పాఠశాల 1993లో స్థాపించామని, ఇప్పటికే 28 సంవత్సరాలు అయ్యిందని పాఠశాల ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రాత్రిపూట విద్యార్థినులకు తన ఇంటిలోనే వసతి కల్పించి కష్టపడి చదివించి మంచి శాతంతో వందకు వంద శాతం ఉత్తీర్ణత అయ్యేలా ఆయన పిల్లలను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. పాఠశాలలో 500 కు పైగా వచ్చిన మార్కులను పరిశీలించి ఆ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. వారికి విద్య నేర్పించిన వారిని ప్రశంసించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు నిర్వహించారు. దేశ నాయకుల వేషాలతో విద్యార్థులు మంత్ర ముగ్ధుల్ని చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్డిఎఫ్సి సేవలను సద్వినియోగం చేసుకోవాలి



హెచ్డిఎఫ్సి బ్యాంకు శాఖ ప్రారంభోత్స కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి ప్రజలు హెచ్డియఫ్సి బ్యాంక్ నూతన శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని శాఖ మేనేజర్ శ్రీధర్ రెడ్డి అన్నారు. చంద్రగిరి పట్టణం పాతపేట ధర్మరాజుల ఆలయ సమీపంలో హెచ్డిఎఫ్సి బ్యాంక్ నూతన శాఖను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీ రేట్లుతో రైతులకు, చిన్న, పెద్ద వ్యాపారులకు, రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. భావన నిర్మాణాలకు వాహనాల కొనుగోళ్లకు దీర్ఘకాలిక రుణాలు అందించనున్నట్లు చెప్పారు. బంగారు ఆభరణాల పైన సరసమైన వడ్డీరేట్లతో నగదు ఇస్తామన్నారు. త్వరలో లాకర్ సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా జనార్ధన్ రెడ్డి, బ్లూ ల్యాండ్ అధినేత నరేంద్ర నాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ నాగ శ్వేత, హెచ్డిఎఫ్సి బ్యాంక్ క్లస్టర్ హెడ్ ముని శ్రీకాంత్ రెడ్డి, సిబ్బంది, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడుకు చెందిన తల్లి రాజమ్మను హత మార్చిన కేసులో నిందితుడైన మనవడు ఇలంగోవన్ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నాలుగు రోజులుగా క్రితం తల్లిని చంపిన రెండో కొడుకు కృష్ణారెడ్డి కుమారుడు ఇలంగోవన్(మనవుడు) అరెస్ట్ చేసినట్లు పుత్తూరు రూరల్ సిఐ భాస్కర్ నాయక్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పుత్తూరు సిఐ మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ రాజమ్మ హత్యకు గురైందన్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు లేట్ మునస్వామి, కృష్ణా రెడ్డి, ఇద్దరు కుమార్తెలు మునెమ్మ, రేణుక ఉన్నారని తెలిపారు. రాజమ్మ భర్త ఆరుముగం 10 సంవత్సరాల క్రితం చనిపోవడంతో రాజమ్మ బాగోగులు పెద్ద కుమారుడు మునస్వామి కొడుకు హరికృష్ణ (మనవుడు) చూసుకుంటున్నారని పేర్కొన్నారు. అతని పేరు మీదగా ఉన్న ఆస్తిని సెటిల్మెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో చిన్న కొడుకు కృష్ణారెడ్డి, కోడలు గౌరీ, వారి కుమారుడు ఇలంగోవన్ కలిసి ' మాకు రావలసిన ఆస్తి మాకు ఇవ్వండి...' అని తరచూ రాజమ్మతో తరచూ ఘర్షణ పడేవాడని తెలిపారు. ఆఖరి సారిగా ఆస్తిలో 'మాకు వాటా ఇస్తారా? ...లేదంటే మిమ్మల్ని చంపేస్తాం..' అని ఫోన్ ద్వారా బెదిరించడంతో పెద్ద కొడుకు మునస్వామి కుమారుడు (మనవుడు) హరికృష్ణ, అమ్మ దేవకి ఇద్దరు కలిసి ఈ నెల 2వ తేదీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు రావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయం గమనించి రెండో కుమారుడు కృష్ణారెడ్డి, భార్య (రెండో కోడలు)గౌరి, వీరి కుమారుడు(మనవుడు) ఇలంగోవన్ ముగ్గురు కలిసి చేతిలో కత్తి ఇచ్చి పంపించి రాజమ్మను గొంతు కోసి పథకం ప్రకారం హతమార్చారు. వీరిలో మనవడు ఇలంగోవన్ ను బంగాళా పంచాయతీ రోడ్ లో అరెస్ట్ చేశామని తెలిపారు. మిగిలిన ఇద్దరినీ, హత్యకు కారకులైన కృష్ణారెడ్డి, గౌరీలను త్వరగా అరెస్టు చేస్తామని సి ఐ భాస్కర్ నాయక్,ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఘనంగా గంగా ప్రసాద్ జన్మదిన వేడుకలు



గంగా ప్రసాద్ జన్మదినం సందర్భంగా కేక్ కట్చేసి తినిపిస్తున్న సునీల్కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు గంగా ప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ శనివారం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ సేవాగుణం, మంచితనం కలిగిన గంగ ప్రసాద్ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నానని తెలిపారు. గంగా ప్రసాద్ లాంటి వారి వల్ల తమ లాంటి యువ నాయకులు ఎందరో వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, బిల్లు చెంచురామయ్య, శ్రీనివాసులు, శివకుమార్, శివ ప్రసాద్ గౌడ్, మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పాశం సునీల్ కుమార్ కొండేపాటి గంగా ప్రసాద్ ఇంటికి వెళ్లి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు గౌడ్ ఆధ్వర్యంలో పేదలకు శనివారం అన్నదానం నిర్వహించారు. గూడూరు పివిసి పార్క్ ఎదురుగా సిద్దయ్య గౌడ్ మనవడు పృథ్వి పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దయ్య గౌడ్, చిరంజీవి, మురళి, అనిల్, సాయి లక్ష్మీ గౌడ్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలంలో నగరి నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి గాలి భాను ప్రకాష్ సమక్షంలో శనివారం పలువురు వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. వడమాల పేట మండలం వడమాల పేట పంచా యతీలో 50 మంది భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో, జిహెచ్ పురం దళితవాడకు చెందిన 30 మంది, యనమల బాల్యం దళితవాడకు చెందిన 25 కుటుంబాల వారు మొత్తం 110 మంది వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ తెలుగు యువత అధికార ప్రతినిధి చినబాబు. వడమాల పేట నాయకులు ధనుంజయుడు నాయుడు, హైమావతి, యువకులు మహిళలు పాల్గొన్నారు.

బాలాయపల్లి : వెంకటగిరి నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీ సాయి ప్రియ ఆధ్వర్యంలో బాలాయపల్లి మండలం లోని గొట్టి కాడు గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు వేమూరు సందీప్ రెడ్డి టిడిపిలో చేరారు. సుమారు 70 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో బాలాయపల్లి మండల టిడిపి అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి , పార్టీ సీనియర్ నాయకులు వెందోటి రాంబాబు రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: చెన్నై శంకర నేత్రాలయ హాస్పిటల్ ఆధ్వర్యంలో బియన్ కండ్రిగ పూజిత బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మే నెల 2వ తేదీ, జూన్ నెల 2వ తేదీ ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వరదయ్యపాళెం డైనమిక్ ఫౌండేషన్ నిర్వాహకులు శనివారం తెలిపారు. కంటికి సంబంధించి ఎలాంటి సమస్యలు వున్నా ఉచిత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చెన్నైలో ఉచితంగా కంటి (లెన్స్) ఆపరేషన్లు చేస్తామని తెలిపారు.ఆపరేషన్కు ఎంపికైన వారికి (అవసరమైతే వారి సహాయకులకు) ఉచిత భోజన, బస వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. కంటి పరీక్షలకు వచ్చే వారు తమ ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకు రావాలని తలస్నానం చేసి పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. పరీక్షలకు హాజరవుతున్న వారికి వరదయ్యపాళెంకు చెందిన ఇనుప రాజేంద్రన్ అన్నదానం చేయనున్నారు. డైనమిక్ ఫౌండేషన్, వరదయ్యపాళెం ఫోను 90008 62322 , 94400 37819 90595 92200, 900487787 నెంబర్ల ద్వారా వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు.

చలి వేంద్రాలు ఏర్పాటు



చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన శంకర్ యాదవ్ తదితరులు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుపతి నగర పరిధిలోని 34, 35, 44వ డివిజన్ల పరిధిలోని చెన్నారెడ్డి కాలనీ, అలిపిరి, గరుడ కూడలి, బాలాజీ బస్టాం డ్, రైల్వే కాలనీలో హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ అగ్రికల్చరల్ డెవల ప్ మెంట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు శంకర్ యాదవ్ ఆధ్వర్యం లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం చలివేంద్రాల వద్ద తిరుపతి నగర ప్రజలతో పాటు, తిరుపతికి వచ్చే యాత్రికులు, శ్రీవారి భక్తులకు మజ్జిగ, మంచి నీటిని అందించారు. వేసవి తాపం తీవ్రంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చలివేంద్రాల వల్ల కాస్త ఉపశమనం లభిస్తుంద నే ఆలోచనతో ఈ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించామని శంకర్ యాదవ్ తెలిపారు. వేసవి ముగిసే వరకు ఈ చలివేంద్రా లను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిశేఖర్ రాయల్, మధు యాదవ్, భూపతి, ప్రకాష్, కృష్ణా రాయల్, శివకుమార్ పాల్గొన్నారు.